నిరుపేద మహిళ ఇంటిని కూల్చివేయడం దుర్మార్గం: సీపీఐ

విశాలాంధ్ర - నర్సీపట్నం: గొలుగొండ మండలం కొత్త ఎల్లవరం చెరువు దగ్గర కూల్చివేసిన మహిళ ఇల్లును సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు, మండల కార్యవర్గ సమితి సభ్యులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి వెంకటరమణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇల్లు లేని నిరుపేదలకు ఇల్లు కట్టుకోమని పథకాలు పెట్టి మరో పక్క కొత్త ఎల్లవరం చెరువుని ఆనుకొని ఉన్న మూడు కుటుంబాలు ఇల్లు, గుడి వీటన్నింటికీ ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా ఒక నిరుపేద మహిళ ఇంటిపై ఉన్నపలంగా రెవెన్యూ సిబ్బంది, పోలీస్ యంత్రాంగంతో కూల్చివేయడం దారుణమన్నారు. 30 సంవత్సరాల నుండి కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తూ పాపను చదివించుకుంటూ ప్రభుత్వ ఐడి కార్డులు అన్నీ ఉండి కూడా ఆ మహిళను ఊరి నుండి బహిష్కరించే విధంగా ఇల్లును దౌర్జన్యంగా కూల్చడం చాలా బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మేకా సత్యనారాయణ, మండల కార్యదర్శి మేకా భాస్కరరావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు జి రాధాకృష్ణ, కార్యవర్గ సమితి సభ్యులు, మాజీ ఎంపిటిసి శెట్టి పైడియ్య, పైల మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

ఆదాయంలో భేష్....అభివృద్ధి మాత్రం శూన్యం

విశాలాంధ్ర - ఆనందపురం: వేములవలస గ్రామపంచాయతీలో ఉన్న మహాత్మా గాంధీ రోజువారీ పువ్వులు మార్కెట్ ఉత్తరాంధ్రకే పెద్ద మార్కెట్‌గా చెప్పుకోవచ్చు. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్కెట్లో అనేకమంది అమ్మకందారులు, రైతులు, కొనుగోలు దారులు వచ్చి పోతూ ఉంటారు. కానీ మార్కెట్లో ఉన్న మరుగుదొడ్లను మాత్రం పట్టించుకునే అధికారులు కరువయ్యారని వాదనైతే బలంగా వినిపిస్తుంది. ఈ మార్కెట్లో మరుగుదొడ్లు అసలు ఉన్నాయా లేదా అనేది కూడా తెలియదు. అంతేకాకుండా స్త్రీలకు, పురుషులకు వేరే బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. చాలా అధ్వానంగా ఉన్నాయి. ఈ మార్కెట్‌పై జీవనోపాధి సాగిస్తున్న మహిళల పరిస్థితి చాలా ఇబ్బందికరంగా వుంది. ఎటు పోలేని పరిస్థితి. మార్కెట్లో ఉన్నవారికి సరైన సౌకర్యాలు లేక దుర్గంధంలో, కంపుతో ఇక్కడ ఉండేవారు నిత్యం తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. సంవత్సరానికి కోట్లలో ఆదాయం ఉన్నా కూడా కనీసం మరుగుదొడ్లను కూడా బాగు చేయకపోవడం చాలా విడ్డూరంగా ఉందని జనాలు వాపోతున్నారు, ఇకనైనా పంచాయతీ అధికారులు మార్కెట్లో మరుగుదొడ్లను బాగు చేసి, అలాగే మంచినీరు సదుపాయం కూడా ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

గడపగడపకు మన ప్రభుత్వంలో మంత్రి అమర్నాథ్

విశాలాంధ్ర - కశింకోట: రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ పాల్గొన్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. కశింకోట మండలం ఎన్‌జి పాలెం గ్రామంలో మంగళవారం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మంత్రికి సర్పంచ్ కలిగట్ల నూకరత్నం నాయుడు ఘనంగా స్వాగతం పలికారు. పథకాలను లబ్ధిదారులకు వివరించారు. జగన్మోహన్రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి కార్యక్రమాలు ఊపందుకున్నాయని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మీ గున్నయ్య నాయుడు, జెడ్పీటీసీ దంతులూరి శ్రీధర్ రాజు, జిల్లా అధికార ప్రతినిధి మల్ల బుల్లిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, మలసాల కిషోర్, వైస్ ఎంపీపీ నమ్మి మీనా గణేష్, కలిగట్ల బాపు నాయుడు, రెడ్డి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని సభకు పోలీసుల సేవలు అభినందనీయం

డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ప్రధాని సభకు పోలీసుల సేవలు అభినందనీయమని డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. విశాఖలో మంగళవారం డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ప్రధాని పర్యటనలో ఎటువంటి ఇబ్బంది కలుగకుండా పోలీసులు అందించిన సేవలు అభినందనీయమని, యువ ఎస్పీలకు ఇది మంచి అనుభవం అన్నారు. కమిషనరేట్ పరిధిలో నేరాలకు సంబంధించిన సమావేశం నిర్వహించామని, లోకదాలత్‌లో పోలీసులు చేసిన కృషి అభినందించారు. 47వేల ఎఫ్ఐఆర్ కేసులు పరిష్కరించామని అన్నారు. సైబర్ నేర నియంత్రణ వ్యవస్థను మరింత పటిష్ట పరుస్తున్నామన్నారు. ఈ సమావేశంలో నగర సిపి సిహెచ్ శ్రీకాంత్, డిసిపిలు పాల్గొన్నారు.

ఆసరా స్వచ్ఛంద సంస్థ సేవలు భేష్

విశాలాంధ్ర - అరకులోయ రూరల్: గిరిజన ప్రాంతంలో 11 సంవత్సరాల పాటు మారుముల ప్రాంతాలలో ఉన్న గిరిజన గర్భిణీలకు ఉచితంగా సేవలు అందిస్తున్న ఆసరా స్వచ్ఛంద సంస్థ సేవలు అమోఘమని గిరిజన సంఘం నాయకులు పేర్కొన్నారు. ప్రతివారం మంగళ, బుధవారాల్లో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు డాక్టర్లు అందుబాటులో ఉండి గర్భిణీలకు సేవలందిస్తున్నారని అన్నారు. పేదలకు ఉచితంగా వైద్యమందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి పాంగి రామన్న, ఉపాధ్యక్షులు జన్ని భగత్ రామ్, కె.రామారావు, ఆసరా స్వచ్ఛంద సంస్థ డాక్టర్ కె.పూర్ణ చందర్, మేనేజర్ కళ్ళ భాస్కర్, అసిస్టెంట్ మేనేజర్ వంశీకృష్ణ, సూపర్వైజర్ రవికుమార్, స్టాఫ్ కృష్ణ తదితరులు ఉన్నారు.

పుస్తకపఠనంతో జ్ఞానం

విశాలాంధ్ర - అచ్యుతాపురం: పుస్తక పఠనంతో జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునని అచ్యుతాపురం గ్రంథాల యాధికారి కోటేశ్వరరావు అన్నారు. 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కూండ్రపు సోమునాయుడు, వై.ప్రభాకర్, నరేంద్ర, మోహన్, సంతోష్, రేణుక, జయశ్రీ, భవానీ, మీనాక్షి పాల్గొన్నారు.

సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

విశాలాంధ్ర - అరకులోయ: గిరిజనుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని జనసేన నాయకుడు, మాజీ ఎంపీటీసీ దురియా సాయిబాబా డిమాండ్ చేశారు. మండల పరిధిలోని బొండం పంచాయతీ సచివాలయంలో జరిగిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పేదలకు ఇళ్ల పట్టాలిచ్చి నేటి వరకు ఇళ్లు నిర్మించి ఇవ్వలేదని ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. బోయ వాల్మీకి బెంతు, ఒరియా(బిసి)లను ఎస్టీలుగా రిజర్వేషన్ కల్పిస్తానని సామ్యూల్ ఆనంద్ కమిటీని నియమించడం ఎంతవరకు న్యాయమని, ప్రభుత్వం తక్షణమే జీవో నెంబర్ 52ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

విశాలాంధ్ర - జి.మాడుగుల: మండలం పెదలువ్వాసింగి పంచాయతీ వంచేబు గ్రామంలో ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి చొరవతో 3 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను సూపర్ సర్పంచ్ వైసీపీ సీనియర్ నాయకుడు కొండపల్లి సత్యనారాయణ, ఎంపీటీసీ గబ్బాడి సన్యాసి దొరలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గబ్బాడి గణపతి, మాజీ సర్పంచ్ గబ్బాడి పందు దొర, వార్డు మెంబర్ కిల్లుడు బొంజుబాబు, కోరాబు పందు పడాల్, వలంటీర్ సాగెని ఏసురత్నం, ఇంజనీరింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర - డుంబ్రిగూడ: మండలంలోని బొందు గూడతో పాటు పరిసర ప్రాంతంలో ఉన్న నిరుపేద వయోవృద్ధులు, అనాధలకు బండి సాహితి రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ట్రస్ట్ అధినేత బండి అశోక రెడ్డి, సుధావాణి దంపతులు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక మండల కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్ బీకే నాయుడు మాట్లాడుతూ నిరుపేద గిరిజనులకు సాహితి రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ అందిస్తున్న సేవలు ఎంతో మంచివన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కోశాధికారి వి.ఇంద్రసేన రెడ్డి, తారకరామ ఆర్గానిక్ యూనిట్ యాజమాన్యం పాల్గొన్నారు.

వివాదాలకు తావు లేకుండా పక్కాగా రీ సర్వే

కలెక్టర్ సుమిత్ కుమార్

విశాలాంధ్ర - పాడేరు: వివాదాలకు తావులేకుండా రీ సర్వే ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో రీసర్వేపై మండల సర్వేయర్లు, గ్రామ సర్వేయర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. సర్వే ప్రక్రియ పూర్తి చేసిన తర్వాత ఎటువంటి సమస్యలు లేకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. సర్వేయర్లు ఎఫ్ఎంబిని దగ్గర ఉంచుకుని రీ సర్వే చేయాలన్నారు. ఎఫ్ఎంబిపై సర్వేయర్లకు, రెవెన్యూ అధికారులకు అవగాహన ఉండాలన్నారు. రీసర్వే డేటాను నాణ్యత పరిశీలించి తహశీల్దార్ లాగిన్ నుండి ఆర్డీవో లాగిన్‌కు పంపించాలని అన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాసు, ఆర్డీవో బి.దయానిధి, సర్వే సహాయ సంచాలకులు వై.మోహన్‌రావు, మండల సర్వేయర్లు, గ్రామ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - పరవాడ: రాజమండ్రిలో ఈనెల 26,27,28 తేదీల్లో జరిగే జాతీయ మహాసభలను కార్మికులు జయప్రదం చేయాలని ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం(ఏఐటీయుసి) జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ పిలుపునిచ్చారు. పరవాడలో మంగళవారం ఆయన సంఘం నాయకుడు మత్తుర్తి సూరిబాబుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రాజమండ్రిలో జాతీయ సభలు జరగనున్నాయన్నారు. సంక్షేమ బోర్డులో పేరు నమోదు చేసుకున్న భవన నిర్మాణ కార్మికులకు ఇంతవరకు గుర్తింపు కార్డులను ఇవ్వలేదని అన్నారు. సంక్షేమ బోర్డును పునరుద్దరణ చేసి పక్క తెలంగాణలో మాదిరిగా సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నాడు-నేడు పనులను పరిశీలించిన డీఈఓ

విశాలాంధ్ర - మధురవాడ: వాంబే కాలనీలో గల హైస్కూల్‌లో చేపడుతున్న నాడు-నేడు పనులను మంగళవారం జిల్లా విద్యా శాఖ అధికారిణి ఎల్.చంద్రకళ పరిశీలించారు. జీవీఎంసీ 7వ వార్డు వాంబే కాలనీలో గల సునీల్ శర్మ కాలనీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల విద్యాసంబంధ విషయాలను ప్రధానోపాధ్యాయురాలు ఎం.ఉమామహేశ్వరిని అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

స్థానికుల నిరసనతో వెనుతిరిగిన జీవీఎంసీ అధికారులు

విశాలాంధ్ర - అనకాపల్లి: అనకాపల్లి జీవీఎంసీ పాత్రుడు కాలనీలో రహదారులపై ఆక్రమణలు అంటూ ఫిర్యాదు చేయడంతో తొలగింపుకై జీవీఎంసీ అధికారులు మంగళవారం వెళ్ళగా స్థానికులు అడ్డు తగలడంతో అధికారులు వెనుతిరిగారు. స్థానిక నివాసుల నుంచి వ్యతిరేకత రావడంతో అవాక్కయ్యారు. మంగళవారం జీవీఎంసీ జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాసరావు, టిపిఎస్ విజయ్ కుమార్‌తో కలిసి ఫిర్యాదు ప్రాంతానికి వెళ్లారు. తీరా వెళ్లేసరికి స్థానికులు అడ్డు తగిలారు. అక్కడ ఎలాంటి ఆక్రమణలు లేకపోగా ఇతర ప్రాంతాలతో సంబంధం లేని ఏరియా కావడం, ఫిర్యాదుదారుడు తప్పుడు ఫిర్యాదులతో ఇబ్బందులకు గురి చేస్తాడని వాపోయారు. గతంలో జీవీఎంసీ అధికారులు మందలించిన సందర్భాలను గుర్తు చేశారు. దీంతో జీవీఎంసీ అధికారులు సదరు ఫిర్యాదుదారుడని మందలించి వెళ్లిపోయారు.

కౌగుంటలో రక్షిత మంచినీటి పథకం

విశాలాంధ్ర - రావికమతం: కౌగుంట గ్రామంలో 41 లక్షలతో ప్రారంభించబోయే జలజీవన్ రక్షిత మంచినీటి పథకం పరిసర ప్రాంతాలను గ్రామీణ మంచినీటి పథకాన్ని డీఈ. జి.శివకృష్ణ, ఏఈ సుజాత, సర్పంచ్ దాసరి సూర్యకుమారి వరహాలు పరిశీలించారు. 20 వేల లీటర్ల రక్షిత మంచినీటి పథకం ట్యాంక్‌ను నిర్మించినట్టు తెలిపారు. ఇప్పటికీ కొమిర, తోటకురపాలెం తదితర గ్రామాలలో 80 శాతం పనులు పూర్తి అయ్యాయని, గొంప, కవగుంట గ్రామాలలో త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

విశాలాంధ్ర - పెదబయలు: యువత చదువులతో పాటు క్రీడల్లో పాల్గొనడం ద్వారా మానసిక ఉల్లాసం పెరుగుతుందని సీఆర్పీఎఫ్ 198 బెటాలియన్ కమాండెంట్ రాజేష్ పాండే అన్నారు. సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా అల్లూరి జిల్లా పెదబయలు మండలం రూఢకోటలో మంగళవారం సిఆర్పిఎఫ్ 198 బెటాలియన్ కమాండెంట్ రాజేష్ పాండే, ఇన్‌స్పెక్టర్ మంజిత్ సింగ్, ముంచంగిపుట్ ఎస్ఐ రవీంద్ర, స్థానిక సర్పంచ్ సురేష్ కుమార్ చేతుల మీదుగా క్రీడాకారులకు క్రీడా సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రూఢకోట సర్పంచ్ సురేష్ కుమార్, బాబుసల సర్పంచ్ మతం బంగారమ్మ, ఏఎస్ఐ పోతురాజు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘం ఎన్నిక

విశాలాంధ్ర - కోటవురట్ల: గ్రామపంచాయతీ కార్యదర్శుల మండల కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల శాఖ అధ్యక్షుడిగా డి.ఎల్.నరసింహారావు, ప్రధాన కార్యదర్శిగా ఎస్. స్వామి నాయుడు, కోశాధికారిగా ఎస్.సంతోషి, సహాయ కోశాధికారిగా ఎం.మౌనిక, కమల, గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శుల సమన్వయకర్తగా ఎల్.రవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారంతా ఎంపీడీవో చంద్రశేఖర్‌ని కలిసి సంఘం ఎన్నిక వివరాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కోటవురట్ల మేజర్ పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవో కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ జ్యోతి, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా మండల సమావేశం

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా జరిగింది. మంగళవారం యస్.రాయవరం మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీపీ కోన లోవలక్ష్మి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అయితే ఈ సమావేశానికి ఎంపిటిసిలు అనుకున్న సమయానికి రాకపోవడంతో ఆలస్యంగా సమావేశం ప్రారంభం అయింది. తొమ్మిది మంది సభ్యులు రావడం జరిగింది. ఈ సందర్భంగా సమావేశంలో శాఖల వారీగా అధికారులు తమ నివేదికను వివరించారు. అదే సమయంలో సర్పంచులు గాడి బుజ్జి, కోశెట్టి రమణ మాట్లాడుతూ మాకు పదవులు తప్ప సరైన గుర్తింపు లేకపోవడంతో ఆవేదన వ్యక్తం చేశారు. జగనన్న కాలనీలో పంచాయతీ విద్యుత్ వినియోగం వల్ల బిల్లులు అధికంగా వస్తున్నాయని సైతారుపేట సర్పంచ్ రావి రమణబాబు విద్యుత్ శాఖ ఏఈ దృష్టికి తీసుకొచ్చారు. కొత్త రేవుపోలవరం గ్రామానికి సంబంధించిన గుడివాడ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్లు కేటాయింపు, సరిహద్దు గుర్తించాలని సర్పంచ్ మల్లె లోవరాజు తహసీల్దార్ పి.శ్రీనువాసరావును కోరారు. ఈ సమావేశంలో తాగునీటి శాఖ ఏఈ శ్రీనివాస్, ఎంపీడీఓ రామచంద్రమూర్తి, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

సీలేరులో పర్యటించిన జర్మనీ బృందం

విశాలాంధ్ర - సీలేరు: జికేవీధి మండలం సీలేరు పరిసర గ్రామాల్లో మంగళవారం జర్మనీ బృందం పర్యటించారు. గిరిజన ఆచార సాంప్రదాయాలను, సీలేరు అందాలను చూసి జర్మనీ దేశస్తులు ఫిదా అయ్యారు. సీలేరు సరిహద్దులోని రాచబెడ గ్రామా న్ని స్థానిక యూసిబిఎం చర్చి బృందంతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా గిరిజనుల ఆచార సాంప్రదాయాలను స్వయంగా పరిశీలించారు. గిరిజనులు సాంప్రదాయ నృత్యం కొమ్ము డ్యా న్సులు చేసే సమయంలో ధరించే కొమ్ములను, నెమలి ఫించంలను ధరించి సంతోషాన్ని వ్యక్తం చేశారు. రాచబెడ గిరిజనులకు విదేశీయ బృందం సీలేరు పాస్టర్ ఫెలోషిప్, యూనైటెట్ చర్చి ఫిలోషిప్ ఆధ్వర్యంలో 250 మందికి దుప్పట్లను పంపిణీ చేశారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

విశాలాంధ్ర - హుకుంపేట: విద్యుత్ షాక్‌కు గురై యువకుడు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. దాలిగుమ్మడి గ్రామంలో కూడా హరిప్రసాద్ (32) అనే యువకుడు మోటార్ రిపేర్ చేస్తుండగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ సతీష్ సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడు స్వగ్రామం శోభకోట పంచాయితీ సంపంగిపుట్టు కావడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. అరుకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి శెట్టి వినయ్, స్థానిక మండల ఎంపీపీ కూడా రాజుబాబు, జెడ్పీటీసీ రేగమ్మచ్చలింగం, స్థానిక సర్పంచ్ పూర్ణిమలు సంతాపం తెలిపారు.

సీఐటీయూ జిల్లా మహాసభ జయప్రదం చేయాలి

విశాలాంధ్ర - అనంతగిరి: వచ్చే నెల 20, 21 తేదీల్లో జరిగే అల్లూరి జిల్లా సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయాలని మండల కార్యదర్శి కిలశీవ్లో మొస్యా పిలుపునిచ్చారు. టోకూరు పంచాయతీ ములియ గుడ బస్ స్టాప్ ఆవరణలో ఆటో కార్మికులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మహాసభలకు విరివిగా విరాళాలు ఇచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు చటరి కొండలరావు, గరం సింహాద్రి, బాడం తులసిరాం, కొర్రా సోమన్న, టి.బాలరాజు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మేధో హక్కుల పరిరక్షణ ఎంతో ఆవశ్యం: మంత్రి అమర్నాథ్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: మేధో హక్కుల పరిరక్షణ ఎంతో ఆవశ్యక అంశమని రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. ఏయూ వైవిఎస్ మూర్తి ఆడిటోరియంలో ఏయూ సెంటర్ ఫర్ ప్రాపర్టీ రైట్స్, ఆ-హబ్, నోవెల్ పేటెంట్ సర్వీసెస్, ఎనిపిఐ, ఎంఎస్ఎంఈ-డిఐ, ఏఎంటిజెడ్, ఎన్ఆర్డిసి సంయుక్తంగా నిర్వహించిన 'ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్(ఐపిఆర్)- కీ ఫర్ అకడమిక్ అండ్ ఇండస్ట్రీ ఎక్సలెన్స్ ఇన్ ఏపి' జాతీయ వర్క్ షాప్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఒక ప్రత్యేకతను సంతరించుకుని తయారవుతున్న వందలాది ఉత్పత్తులకు భౌగోళిక గుర్తింపుకు దరఖాస్తు చేస్తామన్నారు. ఇప్పటికే అరకు కాఫీ అంతర్జాతీయంగా గుర్తింపును పొందిందన్నారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం గత మూడు సంవత్సరాల కాలంలో ఆచార్య పి.వి.జి.డి ప్రసాద్ రెడ్డి మార్గదర్శకంలో అద్వితీయమైన ప్రగతిని సాధించిందన్నారు. కార్యక్రమంలో వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఐపిఆర్ చెయిర్ ప్రొఫెసర్ డాక్టర్ హెచ్.పురుషోత్తం, ఏయూ ఇంక్యుబేషన్ సెంటర్ సిఈఓ రవి ఈశ్వరపు, శుభజిత్ సాహా తదితరులు పాల్గొన్నారు.

హెరిటేజ్ డైరీని సందర్శించిన నారా బ్రహ్మణి

విశాలాంధ్ర - యలమంచిలి రూరల్: మండలంలో పద్మ నాభ రాజు పేట హెరిటేజ్ డైరీని డైరీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రాహ్మణి మంగళవారం సందర్శించి ప్లాంట్లో ఉన్న సౌకర్యాలు చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. హెరిటేజ్ డైరీకి పాలు సరఫరా చేస్తున్న పాడి రైతులకు సంక్షేమ సేవలను రైతులకు అందజేయడం, మెరుగైన సదుపాయాలు కల్పించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తుందని ఆమె అన్నారు. కార్యక్రమంలో హెరిటేజ్ డైరీ హెడ్ ప్రోక్యూర్‌మెంట్ రామ్మోహన్‌రావు, జోనల్ మేనేజర్ వి.దివాకర్‌రావు, రీజనల్ మేనేజర్ పి.నాగప్పారావు, మేనేజర్ కూండ్రపు శేష, డైరీ ఆపరేటర్ వై.ప్రసాద్, ల్యాబ్ అసిస్టెంట్ వి.నానాజీ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను ఎమ్మెల్సీ రఘువర్మ సందర్శన

విశాలాంధ్ర - ముంచింగిపుట్: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ మండలంలోని బంగారుమెట్ట, కిలగాడ, జోలాపుట్టు, లబ్బూరు, పనసపుట్టులలో పలు పాఠశాలలను సందర్శించారు. ప్రతి సమస్యను అసెంబ్లీలో పెట్టి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా ముంచింగిపుట్టు బాయ్స్ 1 పాఠశాల సిబ్బంది రఘువర్మను దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్యాంసుందర్, ఎల్.బి. స్వామి, దామోదర్, కొండ పడాల్, రామ్మన్న కామేశ్వరరావు, బాలు తదితరులు పాల్గొన్నారు.

ఏయూ మెరిట్ విద్యార్థులకు చెక్కులు అందజేత

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: ఆంధ్ర యూనివర్సిటీ మెకనికల్, మెటలర్జీ విభాగాల్లో 2022-23 సంవత్సరాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్టీల్‌ప్లాంట్ మాజీ సీఎండీలు డి.ఆర్.ఆహుజా, డాక్టర్ బిఎస్ సింగ్ పేర్ల మీదుగా గోల్డ్ మెడల్ ఇచ్చేందుకు 6 లక్షల రూపాయల చెక్కులను డాక్టర్ వెంకటసుబ్బయ్యకు స్టీల్‌ప్లాంట్ ఎల్ అండ్ సి ఆడిటోరియంలో స్టీల్ ప్లాంట్ గుర్తింపు ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ, స్టీల్‌ప్లాంట్ మాజీ డైరెక్టర్ (పర్సనల్) వై.ఆర్.రెడ్డి మంగళవారం అందజేశారు. ప్లాంట్ మాజీ సిఎండి బిఎస్ సింగ్ బయోగ్రఫీతో రూపొందించిన పుస్తకాలను విడదల చేశారు. ఈ కార్యక్రమంలో స్టీల్ సీజీఎం మెకానికల్ పీకే మహంతి, స్టీల్ కార్మిక సంఘాల నాయకులు సిహెచ్ నరసింగరావు, మంత్రి రాజశేఖర్, కేఎస్సెన్ రావు, జె.రామకృష్ణ, జె.అయోధ్యరామ్, అనిపెద్ది మసేనురావు, డొక్క నరసింగరావు, యేల్లేటి శ్రీనివాసరావు, ఎన్.రామారావు, ఎన్.రామచంద్రరావు పాల్గొన్నారు.

నిర్వాసితులు చేస్తున్న ఆందోళనలు న్యాయబద్ధం: వివేక్ గనగళ్ల

విశాలాంధ్ర-రాంబిల్లి: నేవీ నిర్వాసితులు చేస్తున్న ఆందోళన న్యాయబద్ధమైనదని జిల్లా మత్స్య, పారిశ్రామిక సహకారం సంఘం మాజీ చైర్మన్ గనగళ్ళ వివేక్ డిమాండ్ చేశారు. నేవల్‌బేస్ ఏర్పాటుతో నిర్వాసితులైన 8 గ్రామాల ప్రజలు తమకు న్యాయం చేయాలని వాడనర్సాపురం సమీపంలోని నేవీ గేటు ముందు చేస్తున్న ఆందోళన మంగళవారానికి 16వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా నిర్వాసితులు పెద్ద ఎత్తున రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వం దిగి వచ్చి తమ డిమాండ్లను పరిష్కరించాలని నినాదాలు చేశారు. నిర్వాసితుల ఆందోళన శిబిరాన్ని వివేక్ సందర్శించి వారితో మాట్లాడారు. 17 సంవత్సరాలుగా నిర్వాసి తులను ఆదుకోకుండా వారి జీవితాలతో ప్రభుత్వం ఆటలాడుతుండటం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ పెద్దలు, 8 గ్రామాలకు చెందిన నిర్వాసతులు పాల్గొన్నారు.

వీఎమ్మార్డీఏ నూతన కార్యదర్శిగా టి.వేణుగోపాల్

విశాలాంధ్ర - విశాఖ: వీఎమ్మార్డీఏ నూతన కార్యదర్శిగా టి.వేణుగోపాల్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన వివిధ విభాగాల అధికారులతో సమావేశమయ్యారు. ఆయన గతంలో విశాఖ అర్బన్, గాజువాక తహశీల్దార్‌గా, ఐలా కమిషనర్‌గా పనిచేసారు.

జగనన్న ఇళ్లు - పేదలందరికీ కన్నీళ్లు

విశాలాంధ్ర - వి.మాడుగుల: మండలంలోని వంటర్లపాలెం, ఎమ్.కోడూరు గ్రామాల్లో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు మాడుగుల నియోజకవర్గ యువ నాయకులు రాయపురెడ్డి కృష్ణ, జగనన్న ఇళ్ళు, పేదలందరికీ కన్నీళ్లు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా వంటర్లపాలెం గ్రామంలో జనసేన సైనికులు జగనన్న కాలనీని సందర్శించారు. ఈ గ్రామాల్లో జగనన్న ఇళ్లకు కేటాయించిన స్థలం ఎందుకూ పనికి రాకుండా చెరువును తలపించే విధంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో వంటర్లపాలెం కోన శ్రీను, హరిబాల కృష మూర్తి, సాయం రమేష్, దిబ్బారు గణేష్, కుంచా అంజి, రామ కృష్ణ, కొప్పు వరాహమూర్తి, మండల జనసైనకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర - నక్కపల్లి: మండలంలో జాతీయ పత్రిక దినోత్సవ కార్యక్రమంలో భాగంగా పాయకరావుపేట ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నక్కపల్లి కేజీబీవీ స్కూలు విద్యార్థులకు సమాజంలో పత్రికల పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ఆచంట రామకృష్ణ, బి.శ్రీనివాస్, ప్రిన్సిపాల్ త్రివేణి, జిల్లా అక్రిడేషన్ కమిటి సభ్యులు కోరాడ చంద్రరావు, ఎన్.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా వుండాలి

విశాలాంధ్ర - మల్కాపురం: మాదకద్రవ్యాలను వాడడం వల్ల జీవితం చిత్తు అవుతుందని జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయా దేవి అన్నారు. స్థానిక మల్కాపురంలోని ప్రకాష్ నగర్‌లో గల శాఖా గ్రంథాలయంలో మంగళవారం మత్తు పదార్థాలపై సదస్సు జరిగింది. జీవన నైపుణ్యాల ద్వారా ఈ వ్యసనాలకు యువత దూరంగా ఉండవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది జి.కె.వి.రాజు, ప్రముఖ రచయిత కె.సత్తిరాజు, గ్రంథాలయాధికారి వి.అజయ్ కుమార్, సెయింట్ ఆన్స్ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

వేపగుంట కన్వెన్షన్ హాల్ నిర్మాణానికి తొలగిన అడ్డంకులు

విశాలాంధ్ర - పెందుర్తి: ఎంపీ విజయసాయిరెడ్డి చొరవతో ఐదు కోట్ల వ్యయంతో జీవీఎంసీ 95వ వార్డు వేపగుంటలో నిర్మించ తలపెట్టిన కన్వెన్షన్ హాలు నిర్మాణానికి అడ్డంకులు తొలగిపోతాయని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ తెలిపారు. గత ఏడాది ఎంపీ విజయసాయి రెడ్డి దీని నిర్మాణానికి శంకుస్థాపన చేయగా నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. కొండను తవ్వి చదును చేశారు. అయితే ఆ స్థలం హౌసింగ్ బోర్డుదని ఆ శాఖ అధికారులు అడ్డుకున్నారు. దీంతో నిర్మాణం ఆగిపోయింది. స్థానిక కార్పొరేటర్ ముమ్మన దేముడు చొరవ తీసుకుని సంబంధిత అధికారులతో చర్చించినా ఫలితం లేకపోయింది. దీంతో ఎమ్మెల్యే అదీప్ రాజ్ మంగళవారం ఉదయం ఆర్డీవో హుస్సేన్, తహశీల్దార్ ఆనంద్ కుమార్, హౌసింగ్ బోర్డ్ అధికారులతో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఆర్డీఓ హుస్సేన్ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి స్థల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో కొలిక్కి వచ్చింది

వేడుకగా కార్తీక సమారాధన

విశాలాంధ్ర -సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీ నృసింహస్వామి వారి దేవాలయంలో కార్తీక సమారాధన(తడియారాదన) మంగళవారం వేడుకగా జరిగింది. స్వామివారి ప్రసాదాలశాలలో కైంకార్యపరులు వివిధ రకాల సంప్రదాయ పదార్థాలను వండి సింహాచలేశునికి నివేదించిన అనంతరం అధికారులు ఉద్యోగులు సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు, దేవస్థానం అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఎప్పటికీ తేలని పంచ గ్రామాల సమస్య

విశాలాంధ్ర - గోపాలపట్నం: పంచ గ్రామాలుగా పిలిచే పురుషోత్తపురం, వేపగుంట, అడవివరం, వెంకటాపురం, చీమలాపల్లిలో 1976 నుంచి సుమారు 12 వేల మంది వరకు భూములు కొనుగోలు చేసి ఇళ్లు, దుకాణాలు కట్టుకున్నారు. 1996 వరకు వీరికి ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాలేదు. పంచగ్రామాల్లో సుమారు 12 వేల ఎకరాలు సింహాచలం దేవస్థానానికి చెందుతాయంటూ 1996లో నాటి పెందుర్తి, విశాఖ రూరల్ తహశీల్దార్లు రైత్వారీ పట్టాలను జారీ చేయడంతో ఈ సమస్య మొదలైంది. బాధితులు కొందరు హైకోర్టును ఆశ్రయించగా 2003లో చంద్రబాబు ప్రభుత్వం వీరికి క్రమబద్ధీకరించుకునే అవకాశం కల్పించింది. 1998 నాటి ధర ప్రకారం 70 శాతం సొమ్ము చెల్లించి తమ స్థలాలను కొందరు క్రమబద్ధీకరించు కున్నారు. అయితే ఇందులో తేడాలున్నాయంటూ అనంతరం ఏర్పడిన వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం 578 జీవోను రద్దు చేసింది. మరో కమిటీనీ వేసింది. ఆ కమిటీ నివేదిక ఇవ్వకముందే 2009 ఎన్నికలు రావడం, అవి ముగిసిన నాలుగు నెలల్లోనే రాజశేఖరరెడ్డి మరణించడంతో పంచ గ్రామాల భూ వివాదం మళ్లీ మొదటకొచ్చింది. వీటిని వివిధ వ్యక్తులు, మఠాలు, పీఠాలు, విద్యా, వ్యాపార సంస్థలు లీజులకు తీసుకున్నాయి. ఈ లీజుల సమయం ముగిసిపోయినా పట్టించుకోరు. కౌలుకి తీసుకున్న వారు సమయం దాటిపోయినా వాటిని తిరిగి ఆయా దేవస్థానాలకు అప్పగించడం లేదు. వాటిని సొంత భూముల్లాగానే వాడుకుంటారు. వీరు చెల్లించే లీజు కూడా మార్కెట్ విలువతో పోలిస్తే చాలా తక్కువే ఉంటుంది. అయినప్పటికీ లీజు మొత్తాలు చెల్లించేవారు కూడా తక్కువే. ఇక ఆక్రమణల సంగతి సరేసరి. కానీ ఈ సమస్య 1903లో జరిగిన గిల్‌మెన్ సర్వే నుంచి మొదలుకుని అనేక చిక్కుముడులతో ఉంది. అప్పటి విజయనగరం సంస్థానం విన్నవం మేరకు మద్రాస్ కలెక్టర్ గిల్ మెన్ అనే సర్వేయర్ ద్వారా ఉత్తరాంధ్ర భూములపై చేసిన సర్వేను గిల్ మెన్ సర్వే అంటారు. దీన్నే ఇనాం, ఎస్టేట్ భూముల వివరాలు తెలిపే డిక్షనరీ అంటారు. ఈ గిల్ మెన్ సర్వే రికార్డులతో మొదలు పెట్టి క్రమక్రమంగా ఒక్కో చిక్కుముడిని విప్పుకుంటూ వస్తే ఈ సమస్య పరిష్కారమవుతుంది. ఇనాం అంటే బహుమతిగా ఇవ్వడం. రాజులు, జమీందారులు తమకు, సమాజానికి సేవ చేసేవారికి.. విశిష్ట వ్యక్తులకు కూడా భూములు ఇచ్చేవారు. వాటిని సర్వీసు ఇనాంలు అంటారు. స్వాతంత్ర్యం అనంతరం సంస్థానాలు, జమీన్లు రద్దు కావడంతో 1956లో ప్రభుత్వం ఇనాం రద్దు చట్టాన్ని తీసుకొచ్చింది. అనంతర కాలంలో ఇనాం భూముల్లో సాగు చేస్తున్న వారిని గుర్తించి వారికి రైత్వారీ పట్టాలు ఇచ్చారు. దేవస్థానాలకు ప్రత్యేకంగా పూజలు, ఇతర సేవలు అందించినందుకు కూడా ప్రతిఫలంగా భూములు ఇచ్చేవారు. వీటిని సర్వీసు ఇనాం భూములంటారు. కానీ, అసలు వృత్తి పరమైన సేవ (సర్వీసు) చేయనివారు, గ్రామాలతో సంబంధం లేనివారు కూడా అనేక మంది ఇనాంల పేరుతో పట్టాలు పొందారు. కొందరు వాటిని బోగస్ పత్రాలతో రిజిస్ట్రేషన్లు చేయించి అమ్మకాలు కూడా చేసేశారు. ఇది గుర్తించి.. 2013లో ప్రభుత్వం ఇనాం చట్టాన్ని సవరించి సర్వీస్ చేసిన వారి వారసులకు మాత్రమే ఇనాం భూములపై హక్కు ఉంటుందని నిర్ణయించింది. అలాగే 2013 తర్వాత కొత్తగా రైత్వారీ పట్టాలు ఇవ్వకూడదని నిర్ణయించారు. 1956 నుంచి ఇచ్చిన రైత్వారీ పట్టాలు చెల్లవని చట్ట సవరణ చేశారు. దీంతో 1956 నుంచి 2013 వరకు ఇచ్చిన రైత్వారీ పట్టాలు చెల్లకుండా నిషేధిత భూములు (22-ఎ) జాబితాల్లో పెట్టారు. ఈ జాబితాలోకి వెళ్లిన భూముల క్రయవిక్రయాలు అధికారికంగా జరగవు. వీటిపైనే ఇప్పుడు పీటముడి పడింది. దేవాదాయశాఖకు చెందిన వేలాది ఎకరాల భూములలో రియల్ ఎస్టేట్ వెంచర్లు, ఇల్లు, పొలాల రూపంలో ఎన్నోవేల రిజిస్ట్రేషన్లు అనధికారికంగా జరిగాయి. ఇవి ఆక్రమణ భూములని ఎండోమెంట్ అధికారులు అంటూంటే రిజిస్ట్రేషన్లు చేసింది ప్రభుత్వమే కదా అని అమ్మకాలు, కొనుగోళ్లు చేసినవారు ప్రశ్నిస్తున్నారు. ఎప్పటికైనా ఈ భూములను క్రమబద్ధీకరిస్తారనే ఆశతో ఎలక్ట్రిసిటీ బిల్లు, ఇంటిపన్ను రశీదులు పట్టుకుని జిల్లాలోని కలెక్టర్, సింహాచలం దేవస్థానం కార్యాలయాల చుట్టూ నిత్యం వేలాది మంది తిరుగుతున్నారు. అయితే అధికారులు ఈ విషయంపై దేవస్థానం భూపరిరక్షణ అధికారుల్లో ఏమాత్రం చలనం లేదు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల సారె ఊరేగింపు

విశాలాంధ్ర - వి.మాడుగుల: మండల కేంద్రంలోని గౌరీ పరమేశ్వరుల సారే ఊరేగింపు ఘనంగా కొనసాగింది. గవర వీధి నుండి మాడుగుల ప్రధాన వీధుల్లో సారె ఊరేగింపు నిర్వహించారు. అలాగే బుధవారం అన్నసమా రాధన నిర్వహించారు. శనివారం గౌరీ పరమేశ్వరుల అనుపుమహోత్సవం చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పొలిమేర విజయలక్ష్మి, బొడ్డేడ గంగాధర్, భీమరశెట్టి పైడిబాబు, వీర్ని సురేష్, పల్లెల రామచంద్ర మూర్తి, మహిళలు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర - దుంబ్రిగూడ: గసభ పంచాయితీ చిమిలిగూడలో నాడు నేడు ద్వారా మంజూరైన నూతన పాఠశాల భవన నిర్మాణానికి స్థానిక పాఠశాల విద్యా కమిటీ సభ్యులతో పాటు ప్రజల భాగస్వామ్యంతో నిర్మాణం చేపట్టాలని ఆ పంచాయతీ సిపిఎం సర్పంచ్ వి.సునీత చెప్పారు. నాడు నేడు ద్వారా ఆ గ్రామంలో ఎలిమెంటరీ పాఠశాల భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.38 లక్షలు మంజూరు చేయగా మంగళవారం స్థానిక సర్పంచ్ ఆధ్వర్యంలో జడ్పిటిసి సిహెచ్ జానకమ్మ శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లలిత, ఎంపిటిసి వి.జెమ్మ, ఉప సర్పంచ్ కె మహదేవ్, వార్డు సభ్యులు పి.సత్యనారాయణ, మోహన్ దాస్, మాజీ సర్పంచ్ పి.సురేష్ కుమార్ పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి 58వ వార్డు ములగాడ నుండి గోందేశి వానిపాలెం బీటీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం వార్డు కార్పొరేటర్ గులిగిందాల లావణ్య పరిశీలించారు. సుమారు 23.45 లక్షలతో నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్ర మంలో వార్డు అధ్యక్షులు గులిగిందాల కృష్ణ, డిఈ ఏడుకొండలు, ఏఈ సత్యనారాయణ, వేణుగోపాల్ రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ రాంబాబుకు గాయాలు

విశాలాంధ్ర - పెందుర్తి: మండలంలోని ముదపాక గ్రామంలో కడియాల అచ్చయ్యమ్మ అనే మహిళ ఆత్మహత్య చేసుకోవడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. పరిస్థితులను అదుపులోకి తెచ్చేందుకు వెళ్లిన ఎస్సై రాంబాబు కాలికి తీవ్ర గాయం అయింది. అతన్ని నగరం లోని ఆసుపత్రికి తరలించి వైద్యసాయం అందిస్తున్నారు.

ట్రామోంటనా కుకింగ్ స్టవ్‌లతో ఎంతో మేలు

విశాలాంధ్ర - పాడేరు: ట్రామోంటనా కంపెనీ తయారు చేసిన పొగరాని పొయ్యిలతో ఎంతో మేలు చేకూరుతుందని వంటల మామిడి సర్పంచ్ రాంబాబు అన్నారు. మంగళ వారం క్రాప్ జోన్ సంస్థ ఎండి సాయిబాబా ఆధ్వర్యంలో మండలంలోని వంటల మామిడి పంచాయితీ ఓనూరు గ్రామంలో పొగరాని పొయ్యిల ఆవశ్యకతపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ తోకల ఈశ్వర రావు, క్రాప్ జోన్ సిబ్బంది రమేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

కొత్తపట్నం మాజీ సర్పంచ్ రాజుబాబు మృతి

విశాలాంధ్ర -రాంబిల్లి/యలమంచిలి: మండలంలో కొత్తపట్నం మాజీ సర్పంచ్, గీత కార్మికుడు అండిబోయిన రాజుబాబు (43) సోమవారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందారు. అస్వస్థతకు గుండెపోటుకు గురవ్వడం తో ఆయన కుటుంబీకులు హుటాహుటిన విశాఖపట్నంలో ప్రైవేటు ఆసుపత్రికి తరలించే లోపే మృతి చెందినట్టు కల్లుగీత కార్మిక సంఘం సొసైటీ సభ్యులు డి.అప్పారావు తెలిపారు. రాజుబాబుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈయన మృతిపై కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, ఆయన సన్నిహితులు శోక సంద్రంలో మునిగిపోయారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - ఆనందపురం: జోన్ 3 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోలాకి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఆనందపురంలో 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా వుండదని ఏఈ సురేష్ కుమార్ తెలిపారు. చందక, గొట్టిపల్లి, బోని, పొడుగుపాలెం, ఆనందపురం సుఖీభవ లే అవుట్‌లో విద్యుత్ సరఫరా వుండదని తెలిపారు.

40 మందిపై బైండోవర్ కేసులు

విశాలాంధ్ర - మాకవరపాలెం: మండలంలో జి.కోడూరు గ్రామానికి చెందిన 40 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు మాకవరపాలెం ఎస్సై రామకృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీన గ్రామంలో నల్లమారెమ్మ తల్లి జాతర జరుగుతున్నందున ముందస్తుగా 40 మంది వ్యక్తులపై బైండోవర్ కేసులు నమోదు చేశామని తెలిపారు.

ఘనంగా వెంకటరాజు పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలో గుడివాడ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, టిడిపి సీనియర్ నాయకులు ఎన్.వెంకటరాజు పుట్టిన రోజు వేడుకలను టిడిపి శ్రేణులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం పెనుగొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో మండల టిడిపి అధ్యక్షులు అమలకంటి అబద్ధం ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు గుర్రం రామకృష్ణ, మండల తెలుగు యువత అధ్యక్షుడు సుంకర శ్రీను, బండి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బిర్సాముండ జయంతి

విశాలాంధ్ర - అరకులోయ: గిరిజన ముద్దు బిడ్డ స్వాతంత్ర్య సమర యోధుడు, జానపద నాయకుడు బిర్సా ముండా నేటి యువతకు ఆదర్శవంతుడని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సురేంద్ర అన్నారు. బిర్సా ముండా 147వ జయంతిని అరకువేలి గిరిజన కార్యాలయంలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సురేంద్ర మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ఉన్న సహజ వనరులు అడవులు పరిరక్షణ కోసం బిర్సాముండ స్ఫూర్తితో పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి పి.బాలదేవ్, గిరిజన సంఘం నాయకులు జి.అర్జున్, కె.మగ్గన్న, కె.జగన్నాథం పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు: మండల కేంద్రంలో ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు జాతీయ నాయకుడు బిర్సాముండా 147వ జయంతిని కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ చీఫ్ ప్రమోటర్ వనుగు శేషాద్రి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో గిరిజన యూత్, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘ నాయకులు మఠం అర్జున్ పడాల్, కె.శివకుమార్, వి.జయరాం, కె.రమణ, పి.ప్రహ్లాదు, జి.కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాడేరు: భగవాన్ బిర్సా ముండా జయంతి సందర్భంగా ఐటీడీఏ సమావేశ మందిరంలో ఆయన చిత్ర పటానికి ఐటిడిఎ సహాయ ప్రాజెక్ట్ అధికారులు వి.ఎస్. ప్రభాకరరావు, ఎం.వెంకటేశ్వరరావు మంగళవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ పరిపాలన అధికారి హేమలత పాల్గొన్నారు.

ఆరాలమ్మను దర్శించుకున్న పైలా

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల మండలం కింతలి వల్లాపురం గ్రామంలో ఆరాలమ్మ అమ్మవారి ఆలయాన్ని మాడుగుల నియోజకవర్గ టీడీపీ నాయకులు పైలా ప్రసాదరావు దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్న సంతర్పణ కార్యక్రమం కోసం 5 వేల రూపాయలను విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మజ్జి బాబ్జి, కలవలపల్లి సోమన్న దొర, అప్పాలు, యుద్ధం రాజు, భీమరాజు, అప్పాన నారాయణ రావు, దండి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ స్టార్ కృష్ణ మరణం తీరని లోటు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ప్రముఖ సినీ నటుడు, సూపర్ స్టార్ కృష్ణ మరణం సినీ ఇండస్ట్రీతో పాటు యావత్ తెలుగు జాతికి తీరని లోటని టిటిడి చైర్మన్, వైఎస్సార్ సిపి విశాఖ ప్రాంతీయ సమన్వయకర్త వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో తనను కలిసిన మీడియాతో ఆయన మాట్లాడుతూ ఆంధ్రుల అభిమాన నటుడు లేరనే విషాదకర వార్త తనను కలచి వేసిందన్నారు. దివంగత మహానేత వైయస్ రాజశేఖరరెడ్డికి కృష్ణ అత్యంత ఆప్తులని, ఇద్దరు ఎంపీలుగా కలిసి రాష్ట్ర పురోభివృద్ధికి కృషి చేశారని శ్లాఘించారు.

గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ హీరో కృష్ణ మృతి పట్ల శోభన్ బాబు సేవా సంఘం సంతాపం తెలియజేసింది. గ్రేటర్ విశాఖ 92వ వార్డు అధ్యక్షులు నందవరపు సోములు మాట్లాడుతూ నటుడిగా, నిర్మాతగా, దర్శకునిగా, నిర్మాణ సంస్థ అధినేతగా సినిమా రంగానికి ఐదు దశాబ్దాల పాటు కృష్ణ అందించిన సేవలు మరువలేనివి అన్నారు. కార్యక్రమంలో శోభన్ బాబు సేవా సంఘం సభ్యులు, కృష్ణ అభిమానులు గ్రామస్తులు పాల్గొన్నారు.

విశాఖ సిటీ: ప్రముఖ తెలుగు సినీ నటులు కృష్ణ మృతి పట్ల ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. తన నటనతో తెలుగు ప్రజల మనసుల్లో ఆయన స్థానం సుస్థిరమైనదని వివి అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. గతంలో ఏయు కృష్ణకి గౌరవ డాక్టరేట్ ను అందించిన విషయం ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

క్షతగాత్రులను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పరామర్శ

విశాలాంధ్ర - పాడేరు: గత ఆదివారం తాజంగి కోరుకొండ గ్రామానికి చెందిన 14 మంది ఒక శుభకార్యానికి వెళుతుండగా చింతపల్లి మండలం సమగిరి గ్రామానికి అతి సమీపంలో బొలెరో వాహనం అదుపుతప్పి బోల్తా పడడంతో 14 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి పరామర్శించారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తాజంగి వైస్ సర్పంచ్ గెమ్మిల రవి, కొయ్యూరు మండలం వైఎస్ఆర్ పార్టీ అధ్యక్షుడు జల్లి బాబులు పాల్గొన్నారు.

గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించండి
ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ

విశాలాంధ్ర - పాడేరు: కేజీహెచ్‌కు వచ్చే గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి రోణంకి గోపాలకృష్ణ చెప్పారు. మంగళవారం కేజీహెచ్‌లోని ట్రైబల్ సెల్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రైబల్ సెల్‌కు మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. గిరిజన ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని కేజీహెచ్ వైద్యాధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ సూపరిండెంట్ డాక్టర్ మైథిలి, ఆర్ఎంఓ డాక్టర్ వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తే చర్యలు

విశాలాంధ్ర-యలమంచిలి: పట్టణంలో అక్రమంగా మద్యం సీసాలు తరలిస్తున్న యలమంచిలి మండలం రేగుపాలెం గ్రామానికి చెందిన వ్యక్తి పట్టుకుని అతను అక్రమంగా తరలిస్తున్న 05మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్సై కె.పాపినాయుడు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా చట్ట వ్యతిరేకముగా మద్యం తరలించినా, అమ్మినా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

టౌన్ ప్లానింగ్ నూతన కార్యవర్గానికి అభినందన

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ టౌన్ ప్లానింగ్ టెక్నికల్ అఫీషియల్ అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం విజయవాడలో జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర టౌన్ ప్లానింగ్ టెక్నికల్ అఫీషియల్ అసోసియేషన్ అధ్యక్షులుగా తిరిగి ఎన్నికైన కె వెంకటేశ్వరరావు (అసిస్టెంట్ సిటీ ప్లానర్), జోనల్ అధ్యక్షులు ఐ వి రమణమూర్తి (అసిస్టెంట్ సిటీ ప్లానర్) తోపాటు ఎగ్జిక్యూటివ్ మెంబర్లు డి. శ్రీనివాసరావు (అసిస్టెంట్ సిటీ ప్లానర్) ప్రమీలరాణి, తేజేశ్వరరావు, వెంకటేశ్వ రరావు, రామకృష్ణ, నారాయణరావు, వెంకటరావు లు మంగళవారం సాయంత్రం జీవీఎంసీ మేయర్ గొలగాని హరి వెంకట కుమారిని, జీవీఎంసీ కమిషనర్ పి రాజబాబును మర్యాదపూర్వకంగా టౌన్ ప్లానింగ్ కార్యవర్గ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా మేయర్, కమిషనర్ టౌన్ ప్లానింగ్ అసోసియేషన్ కార్యవర్గాన్ని అభినందించారు.

సత్తా చాటిన సీలేరు డిఎవి పాఠశాల విద్యార్థులు

విశాలాంధ్ర - సీలేరు: జికెవీధి మండలం సీలేరు ఏపి జెన్‌కో ఆధ్వర్యంలో నడుపబడుతున్న డిఎవి పాఠశాల విద్యార్థులు క్రీడలలో రాణిస్తూ మరోసారి సత్తా చాటారు. ఈ నెల 7, 8 తేదీలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పాడేరులో నిర్వహించబడిన నియోజకవర్గాల వారీ క్రీడలలో బాలుర ఖోఖో విభాగం నుండి ఎస్‌కె.అమీర్‌భాషా, ఎస్‌కె.ఆషిక్, బాలుర కబడ్డీ విభాగం నుండి కె.నవీన్, కె.హేమంత్‌లు రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపకయ్యారు. అదే విధంగా బాలికల ఖోఖో విభాగం నుండి దేవర్షిని, షారోన్, అంబికలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరంతా త్వరలో అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాలలో జరిగే పోటీలలో పాల్గననున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.రామచంద్రరావు తెలిపారు. విజేతలను వారికి తర్ఫీదు ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు జె.కమలాకర్‌ను జెన్‌కో సూపరిండెంటెంట్ ఇంజనీర్ ప్రశాంత్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ంజనీర్ జాకీర్‌హుస్సేన్ ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

అభయాంజనేయ స్వామిని దర్శించుకున్న మాజీ మంత్రి బండారు

విశాలాంధ్ర - పరవాడ: జీవీఎంసీ 79వ వార్డు పరిధి లంకెలపాలెంలో శ్రీ అభయాంజనేయ స్వామి 9వ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్ర మంలో 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, స్థానిక నాయకులు ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు ఆదర్శనీయం

విశాలాంధ్ర - కె. కోటపాడు : తోటి వారిపై కోపం, ఈర్ష్య ప్రదర్శించకుండా సమాజంలోని ప్రతీ ఒక్కరి పట్ల ప్రేమాభిమానాలు చూపమని చేసిన క్రీస్తు బోధనలు మానవాళి మొత్తానికి నిత్యం ఆదర్శనీయమైనవని మాడుగుల నియోజకవర్గ టీడీపీ నాయకులు పైలా ప్రసాదరావు అన్నారు. కే.కోటపాడు మండలం పాతవలస గ్రామంలోని ప్రవచన దేవుని సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిగిన యానివర్సిడే మరియు క్రిస్మస్ వేడుకలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వాక్యోపదేశకులు డా. పద్మ కుమార్ (విజయనగరం), తిమోతి (విశాఖ), అధ్యక్షులు, దేవరాపల్లి జే.ఆర్.జి.మినిస్ట్రీస్ అధ్యక్షుడు సాల్మన్ రాజు, కే.కోటపాడు మండల పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ ఎస్.మోజెస్, కే.కోటపాడు మండల పాస్టర్స్ ఫెలోషిప్ సెక్రటరీ కే.భాస్కర్ జోషఫ్, పాతవలస సర్పంచ్ జామి శ్రావణ్, జామి నారాయణ మూర్తి, మాజీ సర్పంచ్ బండారు నరసింహ నాయుడు, కొత్తభూమి పైలా యువసేన అధ్యక్షులు సిమ్మ ప్రసాద్, సింగన్నదొర పాలెం సర్పంచ్ వెలగల పైడం నాయుడు,పిల్లల రమణ, ఎస్. ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహా భాగ్యం

విశాలాంధ్ర - మధురవాడ: ఆరోగ్యమే మహా భాగ్యం దాని సాధనకు పరసరాల పరిశుభ్రతే ఏకైక మార్గమని 7వ వార్డు కార్పొరేటర్ పిల్లా మంగమ్మ వెంకట్రావు తెలిపారు. జీవీఎంసీ జోన్ 2లో వాంబే కాలనీలో మంగళవారం పారిశుధ్యపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవడం ద్వారా ఆరోగ్యంగా వుండవచ్చన్నారు.

గౌరీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం 60వ వార్డు ఇందిరా కాలనీలో కార్తీక మాసాలలో శ్రీ గౌరీ పరమేశ్వరుల మహోత్సవాల్లో భాగంగా ఆలయ 28వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం గౌరీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. 108 మంది మహిళలతో కలశాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు నగర వైకాపా ప్రధాన కార్యదర్శి సరగడం పత్నీరావు, సహాయ అధ్యక్షులు రాము దాడి వెంకట సూరి అప్పారావు, పోలమర శెట్టి జగన్నాధరావు, కార్యదర్శి దొడ్డి సీతారాం, పోలమర శెట్టి రమణ బాబు, దొడ్డి బారు నాయుడు, కోయిలాడ అచ్యుతరావు, కాళ్ల గణేష్, దాడి త్రినాధరావు, ఆదారి రామకోటి

వంతలలో వైద్య శిబిరం

విశాలాంధ్ర - జి.మాడుగుల: మండల కేంద్రంలో మంగళవారం వంతల పంచాయితి వంతల గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ప్రతిఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని అవగాహన కల్పించారు. 100 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విఘ్నేష్, ఈశ్వరమ్మ, నాగమణి, లోకేష్, సువసి, వైసీపీ మండల యూత్ ప్రెసిడెంట్ కల్యాణ్ పాల్గొన్నారు.

దుర్గామాత ఆలయానికి పైలా విరాళం

విశాలాంధ్ర -దేవరాపల్లి: మండలం బోయిల కింతాడలో మాడుగుల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు పైలా ప్రసాదరావు శ్రీ దుర్గా మాత అమ్మవారి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సంతర్పణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అమ్మవారి ఆలయ అభివృద్ధి కోసం 10 వేల రూపాయలను పైలా గ్రామ పెద్దలకు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కొప్పాక వెంకటరావు (కాసుబాబు)కొమర బాబూరావు,మాజీ సర్పంచ్ వియ్యపు అప్పారావు, కడిమి నాగేష్, గొర్రపల్లి త్రిమూర్తులు, మిసక్క ఈశ్వరరావు, శ్రీను, రాము, భూత వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం ఆర్డీవోగా జయరాం

విశాలాంధ్ర - నర్సీపట్నం: నర్సీపట్నం ఆర్డీవోగా హెచ్‌వి. జయరాం మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఆర్డీవోగా పని చేస్తున్న బిహెచ్.భవానీశంకర్‌కు ముఖ్యమంత్రి కార్యాలయానికి బదిలీ కావడంతో ఆయన స్థానంలో టెక్కలి ఆర్డీవోగా పని చేస్తున్న జయరాంను నియమించారు. బాధ్యతలు స్వీకరించిన ఆర్డీవో జయరాం విలేకర్లతో మాట్లాడారు. రెవెన్యూ, భూసంబంధిత సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

విశాలాంధ్ర - యస్. రాయవరం :మండలంలో పెట్టుగోళ్లపల్లి గ్రామంలో ఆటో ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరు మృతి చెందారు. యస్. రాయవరం పోలీసు హెడ్ కానిస్టేబుల్ భూలోక అందించిన వివరాల ప్రకారం మంగళవారం ఉదయం కురందాసు నరసింహమూర్తి (28) అనే వ్యక్తి తన తండ్రి తో కలిసి ద్విచక్ర వాహనంపై నక్కపల్లి వేళ్తున్న సమయంలో ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొనడంతో నరసింహమూర్తి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్ సి తెలిపారు.

వైభవ వేంకటేశ్వర స్వామి కళ్యాణం

విశాలాంధ్ర - యస్. రాయవరం :మండల కేంద్రం యస్. రాయవరం గ్రామంలో వైభవ వేంకటేశ్వరస్వామి కళ్యాణం వైభవంగా జరిగింది. ఆలయం ఏడవ వార్షికోత్సవ సందర్భంగా గత రెండు రోజులుగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు హరి ఆధ్వర్యంలో హెూమం చేశారు. మధ్యాహ్నం గ్రామంలో స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి సందర్భంగా భారీ సంఖ్యలో అనకాపల్లి వారి అన్నమాచార్య వాగ్గేయ వరదాయిని బృందాలు కోలాటం వైభవంగా నిర్వహించారు. రాత్రి స్వామి వారి కల్యాణం వేదమంత్రాలతో జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బొలిశెట్టి

గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర - కె. కోటపాడు : స్థానిక శాఖ గ్రంథాలయం వద్ద మంగళవారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని విశ్రాంతి ఉపాధ్యాయులు బి. శ్రీనివాసరావు చేతుల మీదుగా చేపట్టారు. దేశ నాయకుల జీవిత చరిత్రలు. బాల సాహిత్యం, వివిధ పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకములను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో శాఖా గ్రంథాలయ అధికారిణి కే సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి: స్వాతంత్ర ఉద్యమ పోరాటంలో గ్రంథాలయాల పాత్ర ఎంతో ప్రాధాన్యతను సంపాదించుకోగా ఆ ఉద్యమంలో పలువురు నేతలు ప్రముఖ పాత్ర వహించారని పలువురు వక్తలు పేర్కొన్నారు. 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను మంగళవారం యలమంచిలి శాఖా గ్రంథాలయంలో గ్రందాలయాధికారి వి.ఆనంద్ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.పి.చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

కశింకోట: తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలులో భాగంగా మంగళవారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి తాళ్లపాలెం ఎంపీటీసీ ఇందల ముసలి నాయుడు పాల్గొని పుస్తక ప్రదర్శన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి గ్రంథపాలకులు జి.మురళీకృష్ణ, చిన్ని భాస్కర్ మరియు ఉపాధ్యాయులు ప్రశాంతి, లోవలక్ష్మి, ఝాన్సీ, నాయుడు, గ్రంథాలయ అధికారి కె.జగన్ పాల్గొన్నారు.

రావికమతం: 55వ జాతీయ గ్రంథాలయ వార్షికోత్సవాల సందర్భంగా కొత్తకోట లో మంగళవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 9, 10 ఇంటర్ తరగతుల వారికి సీనియర్లుగా పరిగణించి ''నేటి సమాజం స్త్రీల రక్షణకు భరోసా ఇస్తుందా! దిశ చట్టం ఎంతవరకు అవసరం అనే అంశంపై' 6 7 8 తరగతుల వారికి 'అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలు' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి ఆర్ వరాహమని ఉపాధ్యాయులు ఉమా రేవతి, రమ్య, భాగ్యరాజు పాల్గొన్నారు.

కోటవురట్ల: గ్రంథాలయాల్లో ఉన్న వివిధ రకాల పుస్తకాలను, దేశ నాయకుల చరిత్రను తెలిపే గ్రంథాలను చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఉపాధ్యాయులు శంకర్ విద్యార్థులకు సూచించారు. 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి అప్పలనాయుడు ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన వ్యాసరచన పోటీలను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ, ప్రభుత్వ హైస్కూల్, బాలికల ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులు, ఉపాధ్యాయులు కుమారి, రాజేశ్వరి పాల్గొన్నారు.

నక్కపల్లి: మండలంలో చినదొడ్డిగల్లు శాఖ గ్రంథాలయంలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలతో భాగంగా మంగళవారం గ్రంథలయాధికారి కె.జనార్ధన్ ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిడి కమల, గ్రంధాయల అభివృద్ధి కమిటి చైర్మన్ ఎం.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

18న జిల్లాస్థాయి యువజనోత్సవాలు

విశాలాంధ్ర - అనకాపల్లి: యువజన సర్వీసుల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశముల మేరకు జిల్లా స్థాయి యువజనోత్సవాలు ఈనెల 18న స్థానిక ఎన్టీఆర్ స్టేడియం నందు నిర్వహిస్తున్నట్లు సెట్విన్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాలలోని భాగంగా, వివిధ సాంస్కృతిక పోటీలు, 15 నుండి 29 సంవత్సరముల వయస్సు కలిగిన యువతీ, యువ కులకు పలు అంశములలో పోటీలు నిర్వహించ బడ తాయని తెలిపారు. జానపద నృత్యాలు (గరిష్ఠంగా 20 మంది సభ్యులు), జానపద గీతాలు (గరిష్ఠంగా వాయిద్యకారులతో సహా 10 మంది), వన్ యాక్ట్ ప్లే (గరిష్ఠంగా 12 మంది), వక్తృత్వ పోటీలు (ఎక్స్ టెంపర్) (ఇంగ్లీషు, హిందీ), సాంప్రదాయ గాత్రము (హిందుస్థానీ కర్ణాటక), సాంప్రదాయ నృత్యము (మణిపురి, ఒడిస్సీ, కథక్, భరతనాట్యము కూచి పూడి), సాంప్రదాయ వాయిద్యములు (పిల్లన గ్రోవి, వీణ, సితార) మృదంగం, తబలా (కర్ణాటక హిందుస్థానీ రాగంలో మాత్రమే), హార్మోనియం (లలిత సంగీతం బాణీలో ఉండాలి), గిటార్ (భారతీయ లేక వెస్ట్రన్ సంగీతం), రాష్ట్ర స్థాయి (రు) పోటీ అంశములు: వక్తృత్వ పోటీలు (తెలుగు), ఆధునిక గీతం, ఆధునిక నృత్యం, మోనో యాక్షన్, మిమిక్రి, వెంట్రిలోక్విజమ్, మేజిక్, పెయింటింగ్, వయోలిన్, ఫ్యాన్సీ డ్రస్, క్విజ్, గ్రూప్ డిస్కషన్.జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్టు, వివరాలకు 94915 53607, 9849342819ను సంప్రదించాలని కోరారు.